


'పనికిమాలిన మూక! చదువు సాకుతో బస్తీరోడ్లమీద గస్తీ తిరిగే మూకకి మానాభిమానాలేమిటి?' మనసును కెలుకుతున్న భావాలతో ఉత్తేజితుడై అర్థస్వగతంగా అన్నాడు రమాకాంతరావు. హఠాత్తుగా నిశ్శబ్దాన్ని తరిమిన ఆ మాటల అంతర్యం కాని, సందర్భం కాని అర్థంకాక శాంతాదేవి, చదివే పుస్తకంనుంచి చూపు మరలించి, సాభిప్రాయంగా చూసింది, అతడివైపు- తన పెద్దకళ్ళను మరింత పెద్దవి చేస్తూ.

'వీళ్లే, ఈ కాలేజీమూక-' అన్నాడు రమాకాంతరావు మళ్లీ అసందర్భంగా, అసంపూర్తిగా.

శాంతాదేవి అలాగే చూసింది.

'మన వెనకా ముందూ పహరా కాస్తూ సినిమా గేటుదాకా క్షేమంగా వదలిపెట్టిన అంగరక్షకులు—'

శాంత నవ్వింది.

'రౌడీలు, వీళ్ళకిహ వేరే పనేం లేదు కాబోలు.'

'పోనిద్దురూ, ఇందులో కొత్తేముంది.'

'చూసి, ఆనందించి అంతటితో తృప్తిపడి ఊరుకోడం సబబు- ఆ వెర్రికేకలూ, పిచ్చి వేషాలూ ఏమిటి?-'

'కుర్రకారు-'

'అందులో ఓ మర్కటరావు ఫోటో కూడా తీసినట్టున్నాడు-'

'అవును, ఐనా మనకి పోయిందేముంది లెండి—'

'అయితే ఇదంతా ఇష్టమేనన్నమాట నీకు?'

'ఇష్టమేమిటి? వాళ్ళకి అంత కుతూహలంగా ఉంటే తీసుకోనీండి-ఇందులో మనకి పోయిన ధనరాశి ఏమన్నా ఉంది గనకనా!'

'అలాగా! పాపం, ఎంత సానుభూతి!' తనతో కూడా రాగం కలిపి స్థాయి హెచ్చించవలసింది పోయి వాళ్ళకి మద్దతు ఇవ్వటమా? అరికాలి దగ్గర మండింది రమాకాంతరావుకి.

'సానుభూతి కాదుటండీ పాపం, వాళ్ళలా అనవసరంగా శ్రమపడుతుంటే!'

'సంతోషించాం!'

'మీరు మహాబుద్ధిమంతులైనట్టు!' వాళ్ళని వెనకవేసుకురావడం అలా ఉంచి, తనమీద ఎదురు దాడికూడా మొదట తప్పు, తర్వాత నేరం! ఈసారి అరికాలిమంట నెత్తి కెక్కింది రమాకాంతరావుకి. అయినా అలవాటు ప్రకారం తమాయించుకున్నాడు.

'అయితే నా అవగుణం నువ్వేం కనిపెట్టావు?'

'అబ్బే, ఏంలేదు!' ధ్వనిస్తోంది. కోపం అణచుకోటానికి ప్రయత్నం చేస్తూ అన్నాడు:

'అయితే, ఎందుకన్నావు?'

'ఊరికేనే.'

'తమరు తటపటాయించ నక్కర్లేదు. సెలవివ్వొచ్చు.'

'అబ్బ, మాటవరసకంటే అలా సాగదీస్తారేం?'

'ఆ అనటమే ముందూ వెనకా కాస్త ఆలోచించి అనాలి.'

అదను చిక్కితే ఆమాత్రం చురక వెయ్యటం రమాకాంతరావుకి చాతనవును.

'అలాగేం?' మూతి ముడుచుకుని చివాలున లేచి పోయింది శాంత.

ఇక్కడ శాంతాదేవి స్వభావాన్ని గురించి కొంత చెప్పవలసి ఉంటుంది. మూతి అట్టేసేపు ముడుచుకుని ఉండటం ఆమెకి అంతఇష్టంకాదు. దానివలన కలిగే లాభాలకంటే నష్టాలే ఎక్కువ అని ఆమెనమ్మకం. మూతి ముడుపు కాలపరిమితి సందర్భానుసారంగా మూడులక్షణాలనుంచి మూడు నిమిషాలదాకామాత్రమే మారుతూఉండాలని, అది ఏ పరిస్థితులలోను మూడు క్షణాలకంటె తక్కువా, మూడు నిమిషాలకంటె ఎక్కువా ఉండరాదనీ ఆమె నిర్ణయం.

పై కారణంచేత శాంతాదేవి మూడు నిమిషాల్లో తిరిగి వచ్చింది- ఉత్తచేతులతో కాదు- ఏదో 'ఆల్బమ్' కాబోలు, ఆమె చేతిలో ఉంది.

'ఈ హంపీశిథిలాల ఫొటోలు చూశారా, ఎంత చక్కగా ఉన్నాయో?'

రమాకాంతరావు నవ్వుకున్నాడు లోలోపల. అతడికి తెలుసు- తనకోపం పోగొట్టటానికే ఈ తాపత్రయం అంతా- ప్రశాంతమైన ఆమె ముఖం చూసి రమాకాంతరావుకి జాలివేసింది. ఆప్యాయంగా అన్నాడు.

'ఎంతో బాగున్నయ్. ఈ ఆల్బమ్ ఎప్పుడూ చూపించావుకాదేం? అయితే ఈ హంపీశిథిలాల ఫొటోలు నీకెక్కడివి శాంతా?'

'ఎక్కడినుంచి వస్తాయి? స్వయంగా సంపాదించాను.' అంది శాంత సగర్వంగా.

'అంటే?'

'అంతే.'

'తెలిసేలా చెప్పదలచుకోలేదా?'

'పూర్వగాథచాలాఉందిదీనికి-వినేఓపికఉందా?'

'ఊఁ చెప్పు, క్లుప్తంగా.'

'ఓ కాలేజీ కుర్రాడిచ్చాడు-'

'కాలేజీ కుర్రాడు!-' రమాకాంతరావు ముఖం ముకుళించింది.

శాంత నవ్వాపుకొని అన్నది. 'అవును. అప్పట్లో-అంటే నాలుగేళ్ళక్రితం సంగతి-నేను స్కూల్ ఫైనల్ చదువుతూన్న రోజుల్లో నాకు చాలామంది ఆరాధకులు ఉండేవాళ్లు.'

'గొప్ప సంగతేలే, పైగా వర్ణించికూడా చెపుతున్నావు-త్వరలో ముగించు.'

'మరి మధ్యలో అడ్డురాకండి-ఒక రోజు సాయంకాలం స్కూల్ నుండి ఇంటికి వస్తున్నాను. జనసంచారం అంతగాఉండే వీధికాదు అది. ఎవరో కుర్రాడు ఎదురుగా వస్తున్నాడు. సమీపంలోకి వచ్చేసరికి అతడు హఠాత్తుగా-'

శాంత ఆగింది. రమాకాంతరావు ముఖం కందగడ్డలా అయింది. 'రౌడీ చెయ్యిపట్టుకున్నాడు కదూ?'

శాంత ముఖం గంభీరంగా పెట్టి అంది— 'కాదు—'

'పాఠం అప్పచెప్పి ఉంటాడు-ఏం?'

'ఊహుఁ.'

'మరి—?' రమాకాంతరావుకి ఉక్కపోస్తోంది.

'తటాలున కెమేరాతీసి ఫొటో తీశాడు-'

'నీకేనా, పొగరుబోతు!'

రమాకాంతరావు పరిస్థితి చూసి శాంతకు నవ్వాగడంలేదు. 'నాకు భయం వేసింది-జరిగిన దానికీ, అంతకంటే రాబోయే అప్రతిష్ఠకీ. ఇప్పుడు తలుచుకుంటే ఆశ్చర్యంవేస్తుంది. ఎలా ధైర్యం చేశానో. కాలేజీలో ఇంకా చదవాలనే ఆశ ఉంటే ఆ ఫొటో నాకు ఇచ్చివేయమన్నాను తీవ్రంగా. పాపం! అలా జరుగుతుందని అనుకుని ఉండడు, గాభరాపడ్డాడు. క్షమించండి అని కాబోలు లోలోపల గొణిగినట్టుగా అన్నాడు. లోకువ కనిపెట్టి మరింత గట్టిగా అడిగేసరికి పాపం 'రీలు' తీసి ఇచ్చివేశాడు. వృథాగా పాడుచేయటం ఎందుకని ఫొటోలు ప్రింటు చేయించాను. అవే ఈ హంపీచిత్రాలు-' తన తెలివితేటలకి కాబోలు చిన్నగా, అందంగా నవ్వింది శాంత. రమాకాంతరావు నవ్వుతూ ఆల్బం పేజీ తిప్పాడు. పేజీ తిప్పటమేమిటి, రమాకాంతరావు విద్యుద్ఘాతం తగిలినవాడులా ఐపోవడమేమిటి, రెండూ ఒకేసారి జరిగాయి! కారణం ఏమిటా? ఆ పేజీలో చక్కని గుండ్రని అక్షరాలు ఇలా వ్రాసిఉన్నాయి.

'హంపీ చిత్రాలు: శ్రీ రమాకాంతరావు సౌజన్యం!'